

సిఎం పర్యటనకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పలాస

ఈనెల 23న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి, ఆస్పత్రి తారురోడ్డు నిర్మాణం, సిఎం బహిరంగ సభ, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. సిఎం పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'జలకళ' అటకెక్కినట్టేనా..?

- బోర్ల తవ్వకాలకు 5,714 మంది దరఖాస్తులు
- గతంలో డబ్బులు చెల్లించిన వారికే అనుమతులు
- కొత్తగా ఒక్కరికీ మంజూరు కాని వైనం
- 154 మందికే అవకాశం

ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకళ పథకం అటకెక్కినట్టే కనిపిస్తోంది. జిల్లాలో సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగానే ఉన్నాయి. ఆ భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలో తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం, మూడేళ్ల కిందట వైఎస్సార్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్‌నూ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత రూ.రెండు లక్షల వరకు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు భారం పడుతున్నా రైతులు అంగీకరించారు. అయినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందించకపోవడంతో మంగళం పాడినట్లేనని రైతులు భావిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబరు 28, 2020లో ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాల నుంచి ఐదెకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.రెండు లక్షల్లోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువైతే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు.

154 మందికే బోర్లు మంజూరు

బోర్ల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నా 154 మందికే అప్రూవల్ ఇచ్చారు. వీరిలో ఆరుగురు రైతులు ఇప్పటికే రూ.19.82 లక్షలు చెల్లించారు. ఇంకా 148 మంది రూ.5.31 కోట్లను చెల్లించాల్సి ఉంది. వీటిలో శ్రీకాకుళం డివిజన్‌లో 59, పలాస డివిజన్‌లో 24, టెక్కలి డివిజన్‌లో 71 మందికి బోర్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

బోర్లు తవ్వినా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వని వైనం

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే, రూ.రెండు లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.రెండు లక్షలు ఇచ్చినా, మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.రెండు లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా, ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా, వాటికైన ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో, విద్యుత్ శాఖ కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో మట్టి కూరుకుపోతోందని, తమకూ బోర్లు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్లకు ప్రభుత్వ ద్రోహం

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇపిఎస్ పెన్షనర్లకు ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందనిఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డుపర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి విమర్శించారు. పెన్షనర్ల విద్రోహక దినాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 74 లక్షల మంది ఇపిఎస్ పెన్షనర్లు పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో దశాబ్దాల తరబడి సేవలందించి, దేశ పురోగతిలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. 1995 నవంబర్ 16 పెన్షన్ పథకం మొదలైనప్పట్నుంచీ ఇపిఎస్ పెన్షనర్లు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై 28 ఏళ్లుగా తమ నిరసన తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు నియమించిన పలు కమిటీలు పెన్షన్ పెంపుదలకు సిఫార్సు చేసినా పురోగతి నామమాత్రమేనన్నారు. దేశంలో సుమారు సగం మంది ఇపిఎస్ పెన్షనర్లకు రూ.వెయ్యి లోపు పెన్షన్ వస్తోందన్నారు. కరవు భత్యం ఇవ్వడం లేదని తెలిపారు. పెరుగుతున్న ధరల కారణంగా వారి పెన్షన్ నిజ విలువ క్రమంగా తగ్గుతోందని, ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.మూడు వేలు చేస్తామని 2014 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన హామీ ఎన్నికల హామీగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇపిఎఫ్ పెన్షన్ మూలనిధిలో వడ్డీ మొత్తంలో సుమారు 25 శాతం మాత్రమే పెన్షన్‌గా చెల్లిస్తున్నారని, కనీసం వడ్డీ మొత్తం పెన్షన్‌గా చెల్లించినా నాలుగు రెట్లు పెన్షన్ ఇవ్వవచ్చని తెలిపారు. దీంతోపాటు పెన్షనర్ జీవిత కాలం తర్వాత నిధి వాపసు లేనందున, ప్రతి సంవత్సరం పెన్షన్ మూల నిధి పెరుగుతూనే ఉందన్నారు. సుదీర్ఘకాలం తర్వాత పెన్షన్ పెంపుదల చేసే దిశగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఏడాది దాటిందని, అమల్లో పురోగతి అంతంతమాత్రంగానే ఉందన్నారు. పెన్షన్ పెంపుదలకు 4,10,039 మంది దరఖాస్తులు చేయగా, డిమాండ్ నోటీసు ఒక్కరికి మాత్రమే వచ్చిందన్నారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు చెల్లించాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా కరువు భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు పోస్టల్ పెన్షనర్ల సంఘ కార్యదర్శి కె.చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. ధర్నాలో అసోసియేషన్ నాయకులు జి.శ్రీనివాసరావు, ఎల్.అనంతరావు, డి.రాములు, కె.సూర్యారావు, పి.గోపాలరావు, వి.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్ సీతారాం

విధులు సక్రమంగా నిర్వహించకుంటే ఇంటికే...

అధికారులను హెచ్చరించిన స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

విధులు సక్రమంగా నిర్వహించని అధికారులను ఇంటికి పంపడం ఖాయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం హెచ్చరించారు. మండలంలోని కొత్తకోటలో సుమారు రూ.33.24 లక్షలతో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లను గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వారణాసి రమణ గృహ నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికేట్‌ను మంజూరు చేయడం లేదని జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తహశీల్దార్ వి.లక్ష్మీనారాయణ, విఆర్‌ఒ వెంకటరావును స్పీకర్ వివరణ కోరగా, నిర్మాణాలు చేపట్టే స్థలం సర్వే నంబరు 48 కోనేరు చెరువు గర్భమని తెలిపారు. గతంలో నిర్మాణాలు జరిగిన గృహాల సంగతేంటని వారిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిర్మించిన గృహాలు సక్రమమం, ఇది అక్రమమా అని ప్రశ్నించారు. పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని, లేకుంటే గతంలో నిర్మించిన గృహాలను తొలగించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తాను ఎవరి పొట్ట మీద కొట్టనని, అధికారుల పనితీరు మారకపోతే మాత్రం ఇంటికి పంపించడం తప్పదన్నారు. కొత్తకోటకు చెందిన సాసుపల్లి అన్నపూర్ణ టిడిపి హయంలో తనకు హౌసింగ్ లోన్ మంజూరైందని, అప్పట్లో రూ.80 వేలు వచ్చాయని, వైసిపి ప్రభుత్వం వచ్చాక మిగతా రూ.70 వేల కోసం అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. హౌసింగ్ అధికారులను స్పీకర్ పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎల్.అనిల్ కుమార్, ఎంపిటిసి సురవరపు సింహాచలం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు కె.వి.జి సత్యనారాయణ, ఎంపిడిఒ పి.వి.పి మురళీమోహన్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, బాన్న రాము, మూడడ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన తర్వాత వచ్చిన దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన తర్వాత పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, లింగ నిష్పత్తి, ఓటర్ల నమోదు తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు ఫారం-6 దరఖాస్తులు 8,323, ఫారం-7 2,343, ఫారం-8కు సంబంధించి 1,808 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఫారం-9, 10, 11, 11ఎ, 11బిలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించామని తెలిపారు. ప్రతి వారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, వారికి వారం వారం జరుగుతున్న ప్రగతిపై వివరిస్తున్నామన్నారు. 1,15,890 మందికి కొత్తగా ఓటరు కార్డులను సిద్ధం చేశామని, వాటిని పంపిణీ చేస్తామన్నారు. అనామలిస్ పెండింగ్, ముసాయిదా జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్టులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు తదితర అంశాలను వివరించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిప్యూటీ తహశీల్దార్ సనపల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కుల గణనపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కుల గణనపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 80 అడుగుల రోడ్డులోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ నేతృత్వాన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా రూపొందించడంతో పాటు అమలు చేయడానికి సామాజిక, విద్య, ఆర్థిక, జీవనోపాధి, జనాభా అంశాలకు సంబంధించిన కుల ఆధారిత సమగ్ర గణనను చేపట్టడం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. సముచితమైన విధాన రూపకల్పన ద్వారా అట్టడుగు వర్గాల అభివృద్ధి, అభ్యున్నతి కార్యక్రమాల ద్వారా ఏ కుల సమూహాలు ప్రయోజనం పొందాయో తెలుసుకుని వాటిపై దృష్టిసారించనున్నట్లు పేర్కొన్నారు.

అర్హత కలిగి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల వ్యవస్థను కుల గణన కోసం వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితర ప్రజాప్రతినిధులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తదితర సంఘాల నాయకులు, మేధావులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలను తెలియజేయాలని కోరారు.



సచివాలయ ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఆర్‌డిటిపి జయరాం

టౌన్ ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో అనుమతుల్లేని భవన నిర్మాణాలు, ఉడా అప్రూవల్ గృహ సముదాయాలను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ జయరాం ఆధ్వర్యాన ఆ శాఖ సిబ్బంది గురువారం పరిశీలించారు. ఇటీవల టౌన్ ప్లానింగ్ కార్యాలయంపై ఎసిబి సోదాలు చేసిన నేపథ్యంలో నిర్మాణాల్లో ఉన్న గృహాల పరిశీలన ప్రాధానం సంతరించుకుంది. ఆరు నెలల కాలంలో ఇచ్చిన అనుమతుల ప్రకారం నిర్మించిన గృహాలను ముందుగా పరిశీలించారు. అనంతరం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుని, వెంటనే నిర్మాణాలు సాగించిన భవనాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ అనుమతుల కోసం సచివాలయాలకు నేరుగా దరఖాస్తు చేసుకున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు ఉండాలని తెలిపారు.

ఆరు నెలల కిందట సచివాలయాల్లో నేరుగా దరఖాస్తులు చేసుకోగా, మున్సిపాల్టీ ప్రమేయం లేకుండా అనుమతులు ఇవ్వడంపై సిబ్బందికి క్లాస్ తీసుకున్నారు. మున్సిపాల్టీకి సంబంధం లేకుండా ఇళ్ల ప్లాన్లను నేరుగా సచివాలయ సిబ్బంది ఇస్తున్నారని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆర్‌డిటిపి జయరాం దృష్టికి తీసుకొచ్చారు. టౌన్ ప్లానింగ్, మున్సిపల్ కమిషనర్ అనుమతులు లేనిదే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరగదని జయరాం స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్, పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి మున్సిపాల్టీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆయన వెంట కమిషనర్ టి.నాగేంద్రకుమార్, టిపిఒ అప్పలరాజు, ప్రేమ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఓటు హక్కు కీలకం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్వీప్ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీని గురువారం ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభాలో 18 ఏళ్లు నిండిన 46 వేల మంది యువత ఉన్నారని, వారిలో 18 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వాళ్లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో 2,500 మంది అధికారులు 24 లక్షల మంది ఓటర్ల ు సంభందించిన జాబితా తయారీలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే ఈ ప్రక్రియ పూర్తి చేయగలమన్నారు. ఓటు హక్కు వినియోగించని వారికి అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటరుగా నమోదయ్యే ప్రక్రియ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందన్నారు. డిసెంబరు నెలాఖరు వరకు నమోదు ప్రక్రియ సాగుతుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం, అందుకు సంబంధించిన విధి విధానాలపై అవగాహన కలిగి ఉండడం కీలకమన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, పలు కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టులను సత్కరిస్తున్న కలెక్టరు, జెసి


ప్రజాస్వామ్యానికి పత్రికలే పునాది

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది పత్రికలేనని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపిడబ్ల్యుజెఎఫ్, ప్రెస్‌క్లబ్ శ్రీకాకుళం, జర్నలిస్టు సంఘాలు సంయుక్తంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలన్నా, ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావాలన్నా మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో పత్రికల పాత్ర కీలకమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ రంగయ్య పాత్రికేయులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. తొలుత 60 ఏళ్లు నిండిన సీనియర్ పాత్రికేయులు సత్తారు భాస్కరరావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, టంకాల సుధాకర్, ఆర్.వి.పట్నాయక్, బెహరా షణ్ముఖరావును కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ, ఆర్‌డిఒ సత్కరించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు, ఐఎఫ్‌ఎబ్ల్యుజె జాతీయ కార్యదర్శి డోల అప్పన్న, ఎపిడబ్ల్యుఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వి రమణ, ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ కార్యవర్గ సభ్యులు తిత్తి ప్రవీణ్ కుమార్, జాప్ జిల్లా కార్యదర్శి గంజి ఎజ్రా, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేవీప్రసాద్, విజెఎఫ్ అధ్యక్షులు టెంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ధాన్యం కొనుగోలులో అధికారులు, మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కుమార్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలుపై అధికారులు, మిల్లర్లతో స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల దగ్గర పరిమాణం ఎంత వస్తుందో, మిల్లర్ల వద్ద అంతే రావాలని స్పష్టం చేశారు. మండలంలో రవాణాకు అందుబాటులో ఉన్న మిల్లర్లకు గ్రామాలను ఎంపిక చేయాలని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు ఎంత వేగంగా తెస్తే, అంత వేగంగా వారి ఖాతాలో డబ్బులు జమవుతాయన్నారు. ఆలస్యమైన కొద్దీ మిల్లర్ల లక్ష్యం పూర్తవుతుందని, దీంతో కొనుగోలుకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చాలా వ్యవసాయ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, సివిల్ సప్లై డిఎం శ్రీనివాసరావు, తహశీల్దార్ ప్రవల్లిక, వ్యవసాయ శాఖ ఎడి బి.తిరుమలరావు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

ఖాతాదారులకు అధునాతన సేవలు

శ్రీకాకుళం అర్బన్ : ఖాతాదారులకు అధునాతన సేవలను కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు అందిస్తుందని ఆ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. బ్యాంకు రజతోత్సవ వేడుకలను నగరంలోని రైతుబజారు వద్ద గల బ్రాంచ్‌లో బ్యాంకు ఖాతాదారులతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగంలో 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,288 మంది సభ్యులతో రూ.31 కోట్లు వాటా ధనం పెంచుకుందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, సిఇఒ కె.శ్యామ్ కిషోర్, బ్రాంచ్ మేనేజర్ ఎస్.బి ప్రభాకరరావు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కరజాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమవుతాయన్నారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి సరోజిని, ఎంఇఒ దేవేంద్రరావు, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, బమ్మిడి కోళ్ళేశ్వరరావు, పున్నయ్య, మాధవరావు, జయమునిరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాంతిశ్రీ

పనితీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి


ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనితీరు బాగులేదని, మార్చుకోకుంటే చర్యలు తప్పవని జిల్లా మహిళ మరియు శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ అన్నారు. గురువారం ఐసిడిఎస్ కార్యాలయ పరిధిలోగల కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీడీ అడిగిన ప్రశ్నలకు సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది వద్ద సరైన సమాధానం, రికార్డు లేకపోవడంతో మండిపడ్డారు. అనంతరం అమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లుకు స్టాక్ వచ్చినప్పుడు పరిశీలించి తీసుకోవాలని, లేకుంటే దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం చిన్నారులకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వారికి తప్పనిసరిగా అందించాలని, ఎంత మొత్తంలో అందించారో వెంటనే నమోదు చేయాలన్నారు. అందించకుండా నమోదు చేస్తే లబ్ధిదారులకు ఫోన్‌చేసి తెలుసుకుంటామని, పౌష్టికాహారం అందలేదని చెప్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు అందజేసిన ఆటవస్తువులు మూటకట్టి పక్కన పెట్టకుండా చిన్నారులు ఆడుకోవడానికి కేంద్రంలో ఉంచాలని సూచించారు. నాడునేడు ద్వారా నిర్మాణం జరుగుతున్న అంగన్వాడీ కేంద్రాల పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆలా చేసిన నాడే బిల్లులు సకాలంలో పడతాయని అమె పేర్కొన్నారు. మరోసారి ఇక్కడకు వచ్చినప్పుడు అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు, కార్యాలయ సిబ్బంది అన్ని రికార్డులతో ఉండాలని అమె ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సిహెచ్. హైమావతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రవికుమార్

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి ప్రభుత్వాన్ని అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో టిడిపి నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టి, అణిచివేయాలనుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి అవివేకమన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదింపుదామా అని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు చిగిలిపల్లి రామ్మోహన్, వండాన మురళీ, ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యారావు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బలగ శంకర భాస్కరరావు, లోలుగు వెంకట్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

రోగులకు పూర్తిస్థాయిలో మందులు

ప్రజాశక్తి- నందిగాం

గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందేలా చూడాలని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధికమిటీ సమావేశం వైద్యాధికారి కె.అనిత కుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైద్యం పూర్తిస్థాయిలో ప్రజలకు అందాలనే ధ్యేయంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారని, ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని, అలాగే ప్రతినెల మండలంలో నాలుగు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి ఆవరణలో జరుగుతున్న ల్యాబ్ నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మండలపార్టీ అధ్యక్షులు తమరి ఫాల్గుణరావు, మర్లపాడు సర్పంచ్ దట్టి తనుజ, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

17 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కొత్తూరు: మండలంలోని రైతులు నుంచి ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసేందుకు 17 కేంద్రాలను పౌర సరఫరాలశాఖ గుర్తించిందని మండల ఎఒ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మిమో సపోవద్దని, నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రంతో పాటు పారాపురం, ఓండ్రుజోల, సిరుసువాడ, వసప, నివగాం, కుద్దిగం, పొన్ను టూరు, గురండి, సోమరాజపురం, దిమిలి, కురిగాం, లబ్బ, నేరడి, బలద, బమ్మిడి, మెట్టూరు, మెట్టూరు బిట్-3లో ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు పాటలు, చిత్రలేఖనం పోటీలు


ఎచ్చెర్ల : కుమార్‌రాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పాటల పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మ్యూజిక్ ఉపాధ్యాయుడు చోడవరపు.ఈశ్వరరావు ఎన్టీఆర్ మున్సిపల్ హై స్కూల్ ఉపాధ్యాయురాలు లక్ష్మి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.పద్మావతి లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎం జె పి ఏపీ బాలికల పాఠశాల, ఎన్‌టిఆర్ మున్సిపల్ హై స్కూల్, ప్రభుత్వ బాలుర పాఠశాల, సెయింట్ పాల్స్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు , డిప్యూటీ లైబ్రేరియన్ వి వి జి ఎస్ శంకర్ రావు , అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్ వి రమణ మూర్తి, పి రామ్మోహన్, టి.రాంబాబు, యు.కళ్యాణి, పి.వరలక్ష్మి, పి.భానుమతి, శివ గణేష్, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు ముందుగా గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వారోత్సవాలు సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, ఎంఇఒ-2 రాజ్ కిషోర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు బి.సూర్యనారాయణ, కొండేటి ప్రకాష్, కుప్పిలి సూర్య నారాయణ, పొన్నాడ సూరిబాబు, మహేష్, శంకర్, జగదీష్, నవీన్, మణికంఠ, పవన్ కుమార్, మధు, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజును సన్మానించారు.

లావేరు: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పసుపుల జగన్నాథం, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకనాధం ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, హైస్కూల్ విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్‌గా విభజించి 'వ్యాసరచన పోటీలు' నిర్వహించారు. కార్యక్రమంలో రాములమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ కారులను స్మరించుకున్నారు. గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో 6 నుండి 10 వ తరగతి వరకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవతి, సల్మా బేగం, లక్ష్మణరావు, గ్రంథాలయ సిబ్బంది దుర్గారావు, పాఠకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పూర్ణ చంద్ర బెహరా అధ్వర్యంలో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు సత్యనారాయణ, శారదా, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలాకి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మి, గ్రంథాలయాధికారి కె.మానస, ఉపాధ్యాయులు పి.మణికుమార్, వై.పద్మ, టి.పద్మావతి, ఎస్.మురళీ, సునీల్ కుమార్, శేఖర్, అప్పన్న పాల్గొన్నారు.

నౌపడ: నౌపడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నౌపడ ఆయుష్ వైద్యురాలు మాధవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకులు ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

టెక్కలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ శాఖ అధికారి గున్న ప్రసాదరావు, విశ్రాంత ఉపాధ్యాయులు జి.మోహన్, గ్రంథాలయాధికారి బి.రూపవతి, సహాయకురాలు అమ్మన్నమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి టి.ఇందిర అధ్యక్షతన వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహులకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రరావు, సంతోష్ కుమార్, సిబ్బంది లక్ష్మి ఉన్నారు.


జి.సిగడాం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పలాస: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉద్యమ కారుల చిత్రపటాలకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి వై.రాంబాబుతో పాటు పాఠకులు పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటానికి ఎంఇఒలు జె.చిన్నవాడు, అర్జున్ నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు భాస్కర్, అచ్యుతరావు, పాపారావు, నారాయణ, ఉమామహేష్, బాబురావు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరిబాబు, రజని, పాఠకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాలు


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్ మోహన్ రెడ్డితో సంక్షేమ పథకాలు అమలు సాధ్య పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం 9, 10వార్డుల పరిధిలో జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలు జరగాలంటే మళ్ళీ జగన్ రావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డ్ కౌన్సిలర్‌లు బచ్చు జగన్, తేజ, జెసిఎస్ కన్వీనర్ సాలీనా ఢిల్లీ, త్రినాథ్, మున్సిపల్ కమిషనర్ రమేష్, నీలపు ఢిల్లీ, రాంజీ, ప్రత్తి అన్వేష్, సత్యం, గాంధీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి పిరీయా సాయిరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మండల అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆ సీ పురుషోత్తం, కారంగి మోహన్ రావు, దువ్వు వివేకానంద , దున్న గురుమూర్తి, సర్పంచ్ ప్రతినిధి బోడ్డ రుషి, నర్తు శివాజీ, నర్తు ప్రసాద్, నీలాపు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే రావాలని వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలోని కోటిపల్లి, రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేటలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధులు కొంచాడ గిరిబాబు, గురుగుబెల్లి అసిరినాయుడు, బొడ్డేపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుతో ముఖ్యమంత్రిగా మళ్ళీ జగనన్నే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోగల మాసాహెబ్‌పేట పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుల అధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లినిద్రల కార్యక్రమాల్లో అమె పార్టీ నేతలతో కలిసి ఆయా సచివాలయాల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెండాను అవిష్కరించి సంక్షేమ బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ జగనన్న సర్కార్ పేద ప్రజలకు ఎంతో మేలు చేసిందని, నవరాత్నాల పేరుతో సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, స్థానిక సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి, రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు పాల్గొన్నారు.



కాలువలను ప్రారంభిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు

రూ. 25 లక్షలతో కాలువల నిర్మాణం

రణస్థలం రూరల్: పైడిభీమవరం అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారు సామజిక బాధ్యతలో భాగంగా మండలంలోని నారువా గ్రామంలో గ్రామీణ అభివృద్ధి కోసం రూ. 25 లక్షల ఖర్చుతో సిసీ కాలువలు నిర్మాణం చేసి గురువారం ప్రారంభించారు. గతంలో నారువా గ్రామంలో కాలువలు లేకపోవడంతో వాడుక నీరు వీధుల్లో నిల్వ ఉండిపోవడం, వర్షాకాలం వర్షంనీరు పొంగి ఇళ్లలోనికి వచ్చి ప్రజలు నానా అవస్థలు పడేవారు. గ్రామ పంచాయతీ అభ్యర్ధన మేరకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిసి కాలువలు నిర్మాణం చేపట్టారు. ఈ కాలువలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి నారువా గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యం ప్రతినిధులు నిత్యానంద రెడ్డికి, శరత్ చంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపిని తరిమికొట్టడమే టిడిపి, జనసేన లక్ష్యం

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టడమే టిడిపి, జనసేన పార్టీల లక్ష్యమని ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ విశ్వక్షేన్ అన్నారు. గురువారం లావేరు మండలంలోని సుభద్రపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎచ్చెర్లలో జనసేన, టిడిపి ఉమ్మడి కార్యాచరణతో భవిష్యత్ గ్యారంటీతో ఈనెల 17 నుంచి నియోజకవర్గంలో తిరుగనున్నట్లు తెలిపారు. వైసిపి వ్యతిరేక ఓటు చీలకుండా వైసిపిని ఓడించడమే రెండు పార్టీల లక్ష్యమన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అరాచకంతోనే రాజ్యమేలుతుందన్నారు. ప్రశ్నించే వారిపై లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండి పడ్డారు. సమావేశంలో లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి. సిగడాం మండలాల పార్టీ అధ్యక్షులు బర్నల దుర్గారావు, బస్వా గోవిందరెడ్డి, కోలా రాజేష్, కాకర్ల బాబాజీ, దాసరి బలరాం, వడ్డాది శ్రీనువాసురావు, దొర రాజరమేష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: జనసేన పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ విశ్వవీక్షన్‌ను ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. టిడిపి, జనసేన ఉమ్మడి కార్యక్రమాల్లో


లావేరు : మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త విశ్వక్షేన్

ప్రాతినిధ్యం వహించాలని అదేశించారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో విశ్వక్సేన్ మాట్లాడుతూ జనసేన - టిడిపి ఉమ్మడి కార్యాచరణతో భవిష్యత్తు గ్యారెంటీ అనే డాక్యుమెంట్ 10 పాయింట్ల మేనిఫెస్టోతో శుక్రవారం నుంచి నియోజకవర్గంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ప్రజలు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బస్వ గోవింద్‌రెడ్డి , బార్నాల దుర్గారావు, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలం చిలకపాలెం వద్ద ఈనెల 27న జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ నాయకులకు పిలుపు నిచ్చారు. మండలంలోని కొచ్చెర్ల, కొవ్వాడ, పాతర్లపల్లి, కోష్ట, బంటుపల్లి, పిషిణి, పైడి భీమవరం గ్రామ సచివాలయాల పరిధిలోని వైసిపి శ్రేణులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అన్నివర్గాలకు సముచిత పదవులు కేటాయించినట్లు చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఒకే వర్గానికి అధిక పదవులు ఇస్తే జగనన్న ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిందని గుర్తుచేశారు. చేసిన మంచిని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

బస్సుయాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండలపార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, సచివాలయ పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో నాణ్యమైన వైద్య సేవలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి కనిష్క అధ్యక్షతన గురువారం ఆస్పత్రి అభివృద్ధికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక మంత్రి అప్పలరాజు స్వతహాగా ప్రముఖ వైద్యులు కావడంతో ఆస్పత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పనకు నాడు-నేడులో భాగంగా కోట్లాది రూపాయలు కేటాయించారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24/7గా మార్చుతూ నిత్యం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆమె తెలిపారు. ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులతో పాటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 172 రకాల మందులు పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్నాయని ప్రజలు



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

వినియోగించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది గ్రామంలో తిరిగి పిహెచ్‌సిలో ప్రజలకు అందించే ఉచిత వైద్యసేవలు, మందుల పంపిణీ, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేసే విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, స్థానిక సర్పంచ్ ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్య నాయుడు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధిలో వాకర్స్‌ను భాగస్వామ్యం చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ కెటి రోడ్డుకు అనుకొని ఉన్న ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్కు) అభివృద్ధిలో వాకర్స్‌ను భాగస్వామ్యం చేయాలని వాకర్స్ సంఘం అధ్యక్షులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కార్యదర్శి పి.రామానంద్ అన్నారు. గురువారం ముత్యాలమ్మ కోనేరును పరిశీలించి మాట్లాడుతూ కరోనా సమయంలో ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి పేరుతో కొంతమంది రూ.74 లక్షలు ఖర్చు పెట్టి విధ్వంసం చేశారని, వాటికి సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలకు ధరఖాస్తు చేసినా అధికారుల నుంచి సమాధానం రాలేదన్నారు. పాలక వర్గం బుధవారం రూ.10 లక్షలు సాధారణ నిధులతో ప్రహరీ నిర్మించేందుకు చైర్మన్ బల్ల గిరిబాబు భూమి పూజ చేశారని, అయితే ముత్యాలమ్మ కోనేరు భూములను వదిలి తూర్పు, దక్షిణ హద్దుల్లో స్తంభాలు పాతేందుకు గోతులు తీయడాన్ని తాము గమనించామన్నారు. కాలువలపై భవన నిర్మాణాలకు అధికారులు ఎలా


గోతులను చూపిస్తున్న వాకర్స్ సభ్యులు

అనుమతులు ఇచ్చారని, సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై కమిషనర్ నాగేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్షేత్రస్థాయిలో పనులపై సిబ్బంది దృష్టి పెట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జివి చిట్టిరాజు అన్నారు. గురువారం ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయం ఎదుట నిర్వహించిన 16వ రౌండ్ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా సిబ్బంది ఆలోచించి పని చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 పనిదినాలు కల్పించేలా సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోజువారి మస్టర్లు విధానంలో కొట్టివేతలు ఉండకూడదని హెచ్చరించారు. రెండు పూటలు పనిచేస్తున్న వేతనదారులకు రూ.270 అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక నేలపై చేపట్టే ట్రెంచ్‌ల తేదీ సమయంతో పాటు వీడియోలు తీసి భద్రపరచాలన్నారు. 37 పంచాయతీల్లో ఉద్యానవన పంటలకు సంబంధించి పూర్తి సమాచారం నెల రోజుల్లో సేకరించి కార్యాలయానికి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. 2022-23 సంవత్సరానికి


మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

మండలంలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, సర్వశిక్ష అభియాన్‌కు సంబంధించి వెయ్యి పనులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. వేతనాలు, మెటీరియల్ కాంపౌండ్ కింద రూ.10.72 కోట్లు చెల్లించనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని పిడిని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మేనేజర్ శ్రావణ్, ఎపిడి శైలజ, విజిలెన్స్ అధికారి లవరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ తిరుమలరావు, సర్పంచ్‌లు అట్టాడ గోవిందరావు, కొల్లి భాస్కరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కామారు యామిని 3వేల మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు నౌపడ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల కృషిచేసిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిశేషు, సూర్యకాంతం, విద్యార్థిని అభినందించారు.

పొందూరు: మండలం లోలుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థి బాకి మధు పరుగుపందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మీనాయుడు, ఎస్.ఇంద్రాణి తెలిపారు. జిల్లా స్థాయిలో కోడిరామ్మూర్తి స్టేడియంలో జరిగిన అండర్-19 విభాగంలో 400 మీటర్లు పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి, గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో జిల్లాలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు ఆగ్నేయంగా విశాఖపట్నంకు 390 కిలోమీటర్ల దూరంలో ఆగ్నేయంగా పారాదీప్ (ఒడిశా) కు 320 కిలోమీటర్ల దూరంలో దక్షిణ నైరుతి దిశా (పశ్చిమ బెంగాల్)కు 460 కిలోమీటర్ల దూరంలో ఖేపుపరా (బంగ్లాదేశ్)కు 610 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఇది ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ తదుపరి 24 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. కోతలు కోసే రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలన కమిటీలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ, రూరల్ మండలాల్లో మండల స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలన కోసం కొత్తగా నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఐసిడిఎస్ ఎపిడి ఎటి వై.లావణ్య, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ జాస్మిన్ తెలిపారు. స్థానిక కెజిబివిలో బాలికలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కస్తూరిభా పాఠశాల అధికారి పి.శిరీష, లీగల్ ప్రొహిబిషన్ అధికారి లక్ష్మణరావు, సోషల్ వర్కర్ డి.మధుర మీనాక్షి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధుబాబు

రామచంద్రాపురంలో పొలంబడి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రామచంద్రపురం గ్రామంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలాస వ్యవసాయ సంచాలకులు ఎల్వి మధుబాబు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడులు పొందే విధంగా రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా 14 వారాలు పాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పంటలను ఆశించు చీడ, పీడలను ప్రకృతి సిద్ధంగా లభించు వనరులతో కషాయాలు తయారు చేసి ఎలా నియంత్రణ చేయవచ్చో క్షేత్రస్థాయిలో కషాయాలు తయారు చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో బ్రహ్మాస్త్రం, జీవామృతం, ఘనజీ వామృతం క్షేత్రస్థాయిలో రైతులకు తయారు చేయు విధానాన్ని తెలియజేశారు. అనంతరం కోతల సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి దానకర్ణుడు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నరేంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, సర్పంచ్ వసంతకుమారి, రైతులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

అంబేద్కర్ జాతరను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంబేద్కర్ జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్యలు కోరారు. గురువారం 7వవార్డు పరిధి చింతాడలో అంబేద్కర్ జాతర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ అంబేద్కర్ యొక్క ఆవశ్యకత పట్ల ప్రస్తుత యువత అంబేద్కర్ భావజాలం వైపు మొగ్గు చూపే విధంగా ప్రజల్ని చైతన్య పరిచే గొప్ప కార్యక్రమం ఎచ్చెర్ల మండల కేంద్రంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ జాతరకు దళిత, ఆదివాసి, అభ్యుదయ, హేతువాద సంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాశ్రీ గణేష్, కెఎన్‌పిఎస్ అంబేద్కర్ జాతర కన్వీనర్ టొంపల రమణ, అంబేద్కర్ యుజవన సంఘం రాకోటి రాంబాబు, రాజు, నీలం నాయుడు, రంగారావు, జగన్ పాల్గొన్నారు.

కొబ్బరి రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- పలాస

కొబ్బరి రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించి తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మార్పు గ్రంథాలయంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, ప్రధాన కార్యదర్శి బైరి కూర్మారావు, ఉపాధ్యక్షులు బంగ్లా కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉద్దాన ప్రాంతం ప్రధానంగా కొబ్బరి, జీడిపై రైతాంగం ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా కొబ్బరిని కొనాలని, కొబ్బరి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేసి కొబ్బరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నాణ్యమైన కొబ్బరి మొక్కలను సరఫరా చేయాలని, కొబ్బరి, జీడి తోటల్లో అంతర్ పంటల కొరకు బోర్లు మంజూరు చేయాలన్నారు. కొబ్బరి రైతులను అన్ని విధాలుగా ఆదుకొని రైతాంగానికి మద్దతు ధర ప్రకటించాలని లేకుంటే రైతాంగంతో కలిసి గిట్టుబాటు ధరల కోసం ఉద్యమిస్తామన్నారు.

వాతావరణ మార్పుతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- బూర్జ

ఆకాశంలో మబ్బులు ఏర్పడి వాతావరణంలో మార్పు కనిపించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోతలకు సిద్ధమైన తరుణంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా చేతికంది వచ్చిన పంట ఏ క్షణంలో ఏమవుతుందో నన్న భయం వారిని తీవ్రంగా వేధిస్తోంది. కోతలు ప్రారంభించాలా వద్దా అనే విషయం వారికి తెలియకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మిగిలింది. విత్తనాలు వేసిన నాటినుంచి నేటివరకు ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పండించిన పంట దక్కుతుందో లేదోనని భయం వారిని వెంటాడుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సకాలంలో సాగునీరు అందక, సమయానికి ఎరువులు లభించకపోవడంతో బ్లాక్‌లో కొనుగోలు చేసుకుని, వడ్డీలకు అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టామని ఫలితం అందుతుందో లేదోనని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి వాతావరణ పరిస్థితులను తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు.

టిడిపి నాయకుల మాటలు నమ్మెద్దు

కోటబొమ్మాళి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్థానిక టిడిపి నేతలు చెప్పిన అబద్ధపు మాటలను నమ్మవద్దని, చంద్రబాబుకు ఓటువేస్తే సంక్షేమ పథకం కావాలన్నా టిడిపి నాయకుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. గురువారం ఆయన పంచాయతీ పరిధిలో పలు కాలనీల్లో స్థానిక వైసిపి నాయకులతో కలిసి రాష్ట్రానికి మళ్ళీ జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం పత్రాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించారు.

'బాలల హక్కుల సదస్సు'కు అమ్మోజీ

ప్రజాశక్తి- రణస్థలం


అమ్మోజీ

అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 17న నిర్వహిస్తున్న అంతర్జాల సదస్సుకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేక అతిథిగా రచయిత్రి, మహిళా పోలీస్ అమ్మోజీ బమ్మిడి హాజరుకానున్నారు. వెబినార్ నిర్వాహకులు నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఆహ్వానపత్రం పంపారు. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన అమ్మోజి రణస్థలం మండలంలోని కోష్ట గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అమ్మోజీ కవయిత్రి, రచయిత్రి, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా మంచి గుర్తింపు పొందారు. బాల్యవివాహాల నియంత్రణ, పిల్లలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పట్ల అవగాహన, లైంగిక వేధింపుల నివారణకు అవగాహన కార్యక్రమాల ద్వారా తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. అంతర్జాతీయ బాలలహక్కుల వారోత్సవాలను ప్రతి ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకూ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాల వేదిక సదస్సులు నిర్వహిస్తున్నారు. సదస్సుకు సభాధ్యక్షులుగా భారత ప్రభుత్వ "రాజ్యమహిళా సమ్మాన్" అవార్డు గ్రహీత, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి వ్యవహరిస్తారు. కార్యక్రమంలో "బాలల హక్కులు - చట్టాలు - సామాజిక బాధ్యత"పై అమ్మోజి ప్రసంగించనున్నారు. ఎందరో ప్రముఖుల మధ్య తనకు స్థానం లభించినందుకు అమ్మోజి హర్షం వ్యక్తం చేస్తూ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జన సందోహంతో 'బగ్గు' కళ్లకు బైర్లు



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: నరసన్నపేట పట్టణాన్ని జనసంద్రం చేసిన వైసిపి రాష్ట్ర బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నామని తెలియజేసేందుకే సామాజిక సాధికార బస్సుయాత్రని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బస్సుయాత్రపై కామెంట్స్ చేశారని విలేకరులు అడగ్గా బగ్గు రమణమూర్తి ఒకసారి వైఎస్ఆర్ కంటివెలుగు పథకంలో మీ కళ్లను చూపించు కోవాలన్నారు. మబగాంలోగానీ, మర్రివలసలోగాని వాలంటీర్లను, ఆశా వర్కర్లను మీ ఇంటికి పంపించడం జరుగుతుందని, ఒక్కసారి మీ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆయన సూచించారు. బస్సుయాత్రకు వచ్చిన జన సందోహాన్ని చూసి మాజీ ఎమ్మెల్యే కంగారు పడుతున్నారన్నారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, చైర్మన్లు కోరాడ చంద్రభూషణ గుప్త, రాజాపు అప్పన్న, పార్టీ అధ్యక్షులు లుకలాపు రవికుమార్, కనుసు సీతారాం, పట్టణ పార్టీ అధ్యక్షులు పోట్నూరు సాయిప్రసాద్‌తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజారు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస


వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి మంజూరైన రైతుబజార్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ నాయకులు హరిష్‌కుమార్, శ్రీకాంత్, విశ్రాంత ఎస్ఐ కూన కృష్ణారావు డిమాండ్ చేశారు. పలాస ఎఎంసి కార్యాలయంలో గురువారం ఎఎంసి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బజార్ ఏర్పాటు ద్వారా చిన్న సన్నకార, మధ్య తరగతి రైతులు పండించే పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు దళారీలు లేకుండా నేరుగా అమ్ముకునేందుకు వీలుంటుందన్నారు. గతంలో టమోటా కొరత ఉండే సమయంలో రూ.200 ధరకు చేరితే సామాన్యులు కొనుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కార్తీక మాసాన్ని అనువుగా తీసుకుని కూరగాయలను ఇష్టానుసారంగా అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలాసకు సమీప ప్రాంతంలో అటు సోంపేట ఇటు టెక్కలిలో కంటే పలాసలో కూరగాయల ధరలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. జనసేన సభ్యులు సందీప్, గిరి బాబు, కిరణ్ ఉన్నారు.

జీడికి అంతర్జాతీయ మార్కెట్‌పై పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వేణుగోపాల్, గరుడభద్ర మహేంద్రా క్యాజూ ఇండస్ట్రీ ఎండి కె.సందీప్‌లు పలాస జీడి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయిలో విక్రయం జరిగేందుకు గల అవకాశాలపై అధ్యయనం చేస్తూ 'క్యాజూ మార్కెటింగ్' అనే నూతన పుస్తకాన్ని రచనచేయగా గురువారం ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ విభాగం ప్రొఫెసర్ జీడి మార్కెట్‌పై అధ్యయనం చేస్తూ పుస్తకాన్ని తీసుకురావడం క్యాజూ ఇండస్ట్రీకి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కలుగుతుందన్నారు. పలాస జీడిని ఒక క్లస్టర్ పరిధిలోకి తెచ్చి అంతర్జాతీయంగా మార్కెట్ చేయవచ్చని రచయితలు అభిప్రాయ పడ్డారన్నారు. రచయితలు ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, సందీప్‌లను డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ బి.వి.రమణ, హెచ్‌డి డాక్టర్ బి.శివకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్య పోరాటం

ప్రజాశక్తి- నరసన్నపేట


పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఒక్కటై పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు, మాజీ కేంద్ర మంత్రి కింజరాపు యర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న వైసిపి అరాచక పాలనను ఇంటికి పంపించే విధంగా ప్రతిఒక్కరూ అడుగులు వేయాలన్నారు. వైసిపిని భూస్థాపన చేయడమే లక్ష్యంగా రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే విధంగా గ్రామస్థాయిలో ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా ముందుకు అడుగులు వేద్దామన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి ధర్మాన తేజ్ కుమార్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, శిమ్మ చంద్రశేఖర్, వెలమల రాజేంద్ర నాయుడు, కత్తిరి వెంకటరమణ, మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ

ప్రజాశక్తి- పలాస


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగమణి తదితరులు

ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ లభిస్తుందని ఉత్తరాంధ్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పి.నాగమణి అన్నారు. కాశీబుగ్గలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలపై పెరుగుతున్న హింసాత్మక సంఘటనలపై పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ మహిళలపై హింస పెరగడానికి కారణం మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సాహిత్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. స్త్రీలు ఇంట, బయట తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరస్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పెద్దఎత్తున నిరసన తెలియజేస్తే తప్పా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలను చైతన్యవంతుల్ని చేసి, సంఘటిత మహిళా ఉద్యమాలు నిర్మాణం కోసం కరపత్రం రూపంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రచారం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, జిల్లా కమిటీ సభ్యులు కె.హేమమ్మ, బి.జానకి, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు యు.జ్యోతి, ఎస్.సీతమ్మ పాల్గొన్నారు.


ఆర్థికసాయాన్ని అందిస్తున్న గోవిందరావు

రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చాపర పెద్ద దేవాంగుల వీధిలో జరిగిన రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రూ.50 వేలు ఆర్థికసాయాన్ని ఆలయ ఉత్సవ కార్యక్రమానికి విరాళంగా అందించారు. గ్రామస్తులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదిస్తే తనవంతు సహాయం చేస్తానన్నారు. అలాగే చేపరలో మూడు రోజులుగా ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. నేటితో ఈ వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి నంబల వెంకటరావు, ఎంజిఆర్ యువసేనసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో కనితివూరు గ్రామంలో పంటకోత ప్రయోగాన్ని ఎఎస్ఒ సిహెచ్ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎఎ విగ్నేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతు మెట్ట మన్మధరావు పొలంలో ఇన్సూరెన్స్ ప్రతినిధి పి.వెంకటేశ్వరరావు పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5:5 మీటర్ల విస్తీర్ణంలో కొలతలు నిర్వహించగా 7 కేజీల 750 గ్రాముల దిగుబడి వచ్చినట్లు సూర్యనారాయణ తెలిపారు.

ట్యాలీ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగ ఆధ్వర్యాన ట్యాలీ సర్టిఫికేట్ కోర్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాలీ సర్టిఫికెట్ కోర్సు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి తోడ్పడుతుందన్నారు. బాలాజీ టాక్స్ కన్సల్టెన్సీ ప్రతినిధి టి.బాలాజీ మాట్లాడుతూ పలు అకౌంట్లలో టాలీ తెలుసుకోవడం వల్ల విద్యార్థులు స్వయంగా ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, కళాశాల వాణిజ్య శాఖ విభాగ అధిపతి ఎల్.కృష్ణారావు, కుమారస్వామి, వాణిజ్య శాఖ అధ్యాపకులు బి.సంతోషి పట్నాయక్, కె.లలితాబాయ్, యు.పావని తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా హోంకు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని మదర్ థెరిసా హోంకు మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యాన భాష్యం పబ్లిక్ స్కూల్ సౌజన్యంతో బియ్యం ప్యాకెట్లు, చీరలు, పళ్లు, తువ్వాళ్లు వితరణగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్ మాట్లాడుతూ ఎందరో నిరుపేదలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వికలాంగులు హోంలో ఉన్నారని, వారందరికీ హోం సిస్టర్స్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్ సిఇఒ ఎం.శివ, వైస్ ప్రిన్సిపాల్ వి.అనిల్ కుమార్, హెచ్ఎం రాకేష్ రాయ్, రమేష్, భాష్యం స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాలు

ఇచ్ఛాపురం: మండల విద్యాశాఖ కార్యాలయ పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్‌కిట్లు, లైబ్రరీబుక్స్ అందించడం జరిగిందని ఎంఇఒ అప్పారావు తెలిపారు. గురువారం ఎంఇఒ కార్యాలయంలో ప్రైమరీ పాఠశాలలు-46, ప్రాథమికోన్నత పాఠశాలలు-8, ఉన్నత పాఠశాలలు -16, రెండు జూనియర్ కాలేజీలకు స్పోర్ట్స్‌కిట్స్, లైబ్రరీ బుక్స్, టాయిలెట్ మెటీరియల్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు.

విజయానికి సమిష్టి కృషి

ప్రజాశక్తి- జి. సిగడాం

పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు, వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, రణస్థలం మండలం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పైడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలం సంతవురిటి గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేశామో ఈసారి కూడా అలానే కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రంగయ్య మాస్టారు, వాండ్రింగి సర్పంచ్ సాకేటి నాగరాజు, సీనియర్ నాయకులు బురాడ వెంకటరమణ, నాగులవలస సర్పంచ్ బత్తుల నాని, పాలకండ్యం సర్పంచ్ ధారబోయిన ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రైవేట్ పాఠశాలల ప్రెసిడెంట్‌గా పల్లంటీ చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర అప్సాసంఘ సమావేశంలో స్టేట్ సెక్రెటరీ దక్కత కృష్ణమూర్తి రెడ్డి అధ్వర్యంలో ఇచ్ఛాపురం నూతన సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రెసిడెంట్‌గా పల్లంటి చిరంజీవి, సెక్రెటరీ మార్కండేయులు, వైస్ ప్రెసిడెంట్ గిన్ని వెంకట రమణ, ట్రెజరర్ ఢిల్లేశ్వర్, తిరుపతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ అధ్యక్షుడు చాటల తులసీదాస్ రెడ్డి, కార్యదర్శి కోట రామారావు, కృష్ణమూర్తి రెడ్డీ, జోహార్ ఖాన్ పాల్గొన్నారు.

డిసిసిబి సేవలపై అవగాహన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

డిసిసిబి బ్యాంక్ ద్వారా అందుతున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చూసుకోవాలని బ్రాంచి మేనేజర్ ఉషా శాంతి, సూపర్‌వైజర్ కవితా రాణి అన్నారు. గురువారం మండలంలోని బోరుభద్ర, కాపు గోదాయవలసలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకే మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నామన్నారు. అలాగే తక్కువ వడ్డీకి బంగారు నగలపై రుణాలు అందిస్తున్నామని, డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తున్నామన్నారు.